సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025

సండే స్పెషల్

ఆవే.. ఐశ్వర్యం!



ఆవులే ఆరాధ్య దైవం.. వాటి పెంపకమే వీరి వృత్తి. గోపంచితం, పంచామృతం వంటి సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంట ఉత్పత్తులే వీరి ఆహారపుటలవాట్లు. మద్యం జోలికిపోని శాకాహార భోజనమే వీరి ఆరోగ్య రహస్యం. వీరి ఆకర్షణీయమైన వేషధారణ, పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలు విభిన్నంగా ఉంటాయి. ఒకప్పుడు అపార పాడి సంపదతో తులతూగారు. ప్రస్తుతం కొంత తగ్గినా.. తరాలుగా వస్తున్న పశు సంపదపై మక్కువతో కాపాడుకొస్తున్న ఈ మధుర లభాణీలపై ఈ వారం ప్రత్యేక కథనం.

- కరణం సుదర్శన్‌రావు / కంగ్టి (నారాయణఖేడ్)

8లో

న్యూస్‌రీల్

సింగూరు నీరు విడుదల



పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో ఒక గేట్‌ను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. గత రెండు రోజులుగా ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో 9వ నంబర్ గేట్‌ను మీటరున్నర ఎత్తుకు ఎత్తి దిగువకు 7262 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రం నుంచి 2500 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 9230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఔట్‌ఫ్లో 9675 క్యూసెక్కులని అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 17.345 టీఎంసీలు నిల్వ ఉంచి, మిగితా నీటిని దిగువకు వదులుతున్నారు.

ఏడుపాయల ఆలయం మూసివేత



వరద పరిస్థితిని సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయాన్ని శనివారం మళ్లీ మూసివేశారు. సింగూరు నుంచి 9675 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతోంది. ఆలయం ఎదుట నుంచి వరద వెళ్తుండటంతో ఇరిగేషన్ అధికారుల సూచన మేరకు ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు. అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్ వేర్వేరుగా అమ్మవారికి పూజలు చేసి మంజీరా వరదను పరిశీలించారు. అటు వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంధ విద్యార్థికి ఆర్థిక సాయం



వికాస్‌కు నగదు అందజేస్తున్న జగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లొంక తండాకు చెందిన అంధ బాలుడు వికాస్ నాయక్ నిజామాబాద్‌లోని అంధుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల వయస్సులోనే చూపు కోల్పోయాడు. తండ్రి రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఈ నిరుపేద కుటుంబం శనివారం జగ్గారెడ్డి వద్దకు వచ్చి తమ గోడు వెల్లబోసుకోగా, వైద్య ఖర్చుల కోసం వికాస్‌కు రూ. 7.50 లక్షల నగదు అందజేశారు. వికాస్ కొమురవెల్లి మల్లన్న, బీరప్ప, సీతారామచంద్రులు వంటి ఆధ్యాత్మిక, పౌరాణిక గాయాలు పాడటంలో ప్రావీణ్యం సంపాదించారు. కాగా అతడికి కొత్త సెల్‌ఫోన్ అందజేసి, యూట్యూబ్ చానెల్ పెట్టించేందుకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

నియమాలు పాటిద్దాం..

- ప్రమాదాలను నివారిద్దాం



రవాణాశాఖ మంత్రి పేరిట లేఖ

రామాయంపేట(మెదక్): కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కార్డులు పొందేవారికి ప్రభుత్వం కొత్త తరహాలో అవగాహన కల్పిస్తోంది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేరిట ప్రత్యేకంగా లేఖ ప్రతితో పాటు కార్డులను పోస్టులో పంపుతోంది. మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.. భద్రతా నియమాలు పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దామని లేఖలో పేర్కొంది. ఇదే విషయమై జిల్లా రవాణా అధికారి వెంకటస్వామి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో కనీసం 600 మందికిపైగా వాహనదారులకు వాహన రిజిస్ట్రేషన్ కార్డులతో పాటు మంత్రి పేరిట లేఖలు పంపించామని తెలిపారు.

అభ్యంతరాల వెల్లువ!



ఎన్‌హెచ్‌ఏఐఆర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

- ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలంటున్న రైతులు
- పరిహారం లెక్కింపు విషయంలో అన్యాయం చేయొద్దని ఆవేదన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ విషయంలో స్థానిక ప్రజల నుంచి ఇంకా అభ్యంతరాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ రహదారి అలైన్‌మెంట్ మార్చాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం నిరుపేద చిన్న, సన్నకారు రైతులే నిర్వాసితులుగా మారుతున్నారు. తరతరాలుగా భూమినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నామని తమ బతుకు దెరువును లాక్కోవద్దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సంగారెడ్డి పట్టణంలోని చింతపల్లి వాసులు శుక్రవారం హైదరాబాద్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్ఓ (రీజనల్ అధికారి)ను కలిసి వినతిపత్రం అందజేశారు. అలైన్‌మెంట్ మార్చని పక్షంలో సేకరిస్తున్న భూములకు ఇచ్చే పరిహారమైన న్యాయబద్ధంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రామీణ ధరలతో పరిహారమా?

రహదారి నిర్మాణం కోసం సేకరిస్తున్న భూముల్లో సంగారెడ్డి పట్టణంలోని చింతలపల్లి వాసులు నిర్వాసితులుగా మారుతున్నారు. ఈ ప్రాంతం 2018లోనే సంగారెడ్డి మున్సిపాలిటీలో విలీనమైంది. పట్టణంలోని 17వ వార్డు పరిధిలో ఉంది. అయితే మున్సిపాలిటీ పరిధిలో ఉన్న భూములను ఇప్పుడు రీజనల్ రింగ్ రోడ్డు కోసం సేకరిస్తున్నారు. ఈ భూములుకు ఇచ్చే పరిహారం మాత్రం గ్రామీణ ప్రాంతంలో ఉన్న భూముల ధరలతో లెక్కిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తమ భూములకు గ్రామీణ ప్రాంత ధరలతో ఎట్లా లెక్కిస్తారని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీ ధరలతో లెక్కించి పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో అలైన్‌మెంట్‌ను మార్చాలని శుక్రవారం ఆర్ఓకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

మా భూములు గుంజుకోవద్దు

ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం నిరుపేద రైతుల భూములే పోతున్నాయని, తక్షణం ఈ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చాలని కొండాపూర్ మండలానికి చెందిన నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. గిర్మాపూర్, అలియాబాద్, మరేపల్లి, మాచేపల్లి, గంగారాం, శివన్నగూడెం, రాంపూర్ తండా గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తామంతా నిరుపేదలం, మా భూములు గుంజుకోవద్దని కోరారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ కూడా అండగా నిలుస్తోంది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో రైతులంతా సమావేశమై.. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అయితే నిర్వాసితుల అభ్యంతరాల విషయంలో అధికార యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందనేది వేచి ఉండాల్సిందే.



ఝరాసంగం మండలంలోని నిమ్జ్ ప్రాంతం

స్మార్ట్ సిటీకి అడుగులు

- నిమ్జ్ పరిసర గ్రామాల్లో ఏర్పాటు
- 3,200 ఎకరాల విస్తీర్ణంలో ప్రాజెక్టు
- నిర్మాణానికి రూ. 2,361 కోట్లు
- త్వరలో టెండర్ ప్రక్రియ. ప్రారంభం కానున్న పనులు

సంగారెడ్డి జోన్: జహీరాబాద్ నియోజకవర్గంలోని నిమ్జ్ ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న స్మార్ట్ సిటీకి అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా ప్రకటించి ఏడాది పూర్తి కావొస్తున్నా, అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఆమోదించిన నిధులు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి కోరారు. ఈ మేరకు నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

3,200 ఎకరాలు.. రూ. 2,361 కోట్లు

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి అమలు ట్రస్ట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్- నాగపూర్ పారిశ్రామిక అభివృద్ధి అమలులో భాగంగా ప్రాజెక్టును నెలకొల్పుతున్నారు. ఇందుకోసం సుమారు 3,200 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2,361 కోట్ల నిధులతో పనులు చేపట్టనున్నారు. ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఏర్పాటవుతున్న నిమ్జ్ (జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి) పరిధిలోని బర్దిపూర్, ఎల్గోయి, చిలపల్లి, చీలపల్లి తండా గ్రామాల శివారులో స్మార్ట్ సిటీ ఏర్పాటు కాబోతుంది. ఇందులో భాగంగా పారిశ్రామికవాడలో రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక వసతుల కోసం అభివృద్ధి చేయనున్నారు. కేటాయించిన భూములను ఇటీవల టీజీఐఐసీ ఎండీ శశాంక్‌తో పాటు కలెక్టర్ ప్రావీణ్య ఇతర అధికారులు పరిశీలించారు. ప్రాజెక్టులో భాగంగా అవసరమయ్యే భూములను గుర్తించి ఫెన్సింగ్ వేయాలని అధికారులకు ఆదేశించారు. నవంబర్ వరకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు రూపకల్పన చేస్తున్నారు.

కొనసాగుతున్న భూ సేకరణ

నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో వివిధ గ్రామాల్లో నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూములు గుర్తించారు. 12 వేల ఎకరాలకుపైగా భూములు స్వీకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి విడతలో బర్దిపూర్, ఎల్గోయి, చీలపల్లి, చిలపల్లి తండా గ్రామాల్లో 3,600 ఎకరాల భూమిని సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ నిలిచిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసింది. అయితే ఇప్పటివరకు సుమారు 8,000 ఎకరాల వరకు భూమి సేకరణ పూర్తి కాగా, మిగితా భూమి సేకరణ కొనసాగుతోంది.

మారనున్న రూపురేఖలు

స్మార్ట్ సిటీ రాకతో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలతో పాటు సరిహద్దు కర్ణాటక రాష్ట్రం బీదర్ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. ఈ ప్రాజెక్టును దృష్టిలో ఉంచుకొని జహీరాబాద్ మీదుగా హైదరాబాద్- ముంబై హై స్పీడ్- బుల్లెట్ రైలు వెళ్లేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే హుగ్గెల్లి నుంచి నిమ్జ్ ప్రాంతానికి రహదారి ఏర్పాటు చేశారు. స్థానికంగా పరిశ్రమలు రావడంతో ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగుపడి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

గురువులు.. సమాజ నిర్దేశకులు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు: దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదిలోనే జరుగుతుందని.. అలాంటి గురువులను గత 24 సంవత్సరాలుగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గౌరవించడం అభినందనీయమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కొనియాడారు. శనివారం డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి నుంచి ప్రారంభమై, నేడు పార్లమెంటు సభ్యుడి వరకు ఎదగడం వెనక తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల కృషి ఉందని ప్రశంసించారు. ప్రస్తుత సమాజంలో మొబైల్ వాడకం అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థి చదువుతో పాటు మానసిక ప్రవర్తనను గమనించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని కొనియాడారు. కార్పొరేట్ పాఠశాలల ద్వారా పోటీ ఉన్నప్పటికీ, ప్రైవేట్ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, వివిధశాఖల అధికారులు, ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

జహీరాబాద్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు విమర్శించారు. శనివారం జహీరాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా విభాగ్ అభ్యాస వర్గ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రూ. 8,500 కోట్ల పైచిలుకు ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. దీంతో యాజమాన్యాలు విద్యాసంస్థలను నడపలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో విద్య కోసం బడ్జెట్‌లో 13 నుంచి 14 శాతం కేటాయింపులు చేస్తుంటే, మన రాష్ట్రంలో మాత్రం అందులో సగం కూడా కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ అధ్వాన్నంగా మారందన్నారు. గ్రూప్-1 నియామకాలకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపడితేనే వాస్తవాలు బహిర్గతం అవుతాయన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే ఊరుకునేది లేదని, ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు ఆకాష్, రాజు, ఆదిత్య, లక్ష్మణ్, జిల్లా ప్రముఖ్ మాధవరెడ్డి, అగ్రి విజన్ స్టేట్ కన్వీనర్ మానస, స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ ఉదయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఖాళీలు భర్తీ చేయాలి

జహీరాబాద్ టౌన్: ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలాకాలంగా ఇన్‌చార్జి ఎంఈఓలుగా కొనసాగుతున్నారని, దీని వల్ల సబ్జెక్టుల కొరత ఏర్పడుతుందన్నారు. ఖాళీలను సీనియర్ ప్రధానోపాధ్యాయులతో పదోన్నతి ద్వారా భర్తీ చేయాలన్నారు. నూతన పీఆర్సీ అమలుచేసి రెండు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. యూనియన్ నాయకులు రమణకుమార్, బషీర్ అహ్మద్, బుర్హన్ పాల్గొన్నారు.

4,334 కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర



రాజీపత్రం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సంగారెడ్డి టౌన్: రాజీ మార్గంతోనే కేసులు పరిష్కారం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. చాలా కాలంగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలను సామరస్యంగా చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 4,334 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వర్షం.. ఆర్టీసీకి నష్టం



మెదక్ కలెక్టరేట్: భారీ వర్షాలు ఆర్టీసీకి నష్టం మిగిల్చాయి. ఆగస్టు చివరి వారంలో మెతుకు సీమలో కురిసిన కుంభవృష్టితో భారీగా వరద పోటెత్తింది. దీంతో జిల్లావ్యాప్తంగా పంచాయతీ రాజ్ పరిధిలో 63 కిలో మీటర్ల మేర 14 రోడ్లు ధ్వంసం కాగా, 15 చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. అలాగే ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 29 రోడ్లు ఉండగా, 53 కిలో మీటర్ల మేర ధ్వంసం అయ్యాయి. దీంతో మెదక్ నుంచి ఎల్లారెడ్డికి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. మెదక్ నుంచి సిద్దిపేటకు ప్రతిరోజు పది బస్సులు నడుస్తాయి. సిద్దిపేట వరకు మెదక్ బస్సు వెళ్లడంతో రోజుకు రూ. 20 వేల ఆదాయం వస్తుంది. భారీ వర్షాల కారణంగా రోడ్డు తెగిపోవడంతో ప్రస్తుతం రామాయంపేట వరకే బస్సును నడిపిస్తున్నారు. దీంతో సగం ఆదాయం పడిపోయింది. ఈ లెక్కన ఈ రూట్‌లో ఇప్పటివరకు రూ. 15 లక్షల ఆదాయం తగ్గింది. అలాగే ఎల్లారెడ్డి రూట్‌లో మెదక్ బస్సులు రోజుకు 5 చొప్పున నడుస్తాయి. ఒక్కో ట్రిప్‌కు రూ. 2 వేల చొప్పున రోజుకు రూ. 10 వేల ఆదాయం వస్తుంది. పోచారం డ్యాం పొంగిపొర్లి రోడ్డు తెగిపోవడంతో 5 రోజులు బస్సులను నిలిపివేశారు. దీంతో సుమారు రూ. 1.30 లక్షల నష్టం వాటిల్లింది. అలాగే పాపన్నపేట రూట్‌లో బొడ్మట్‌పల్లి వరకు రోజుకు 6 బస్సులు నడుస్తాయి. రెండు రోజులు బస్సులు నిలిచి పోవడంతో సుమారు రూ. 1.50 లక్షల నష్టం చేకూరింది. ఇలా మొత్తం 5 రోజుల పాటు ఆయా రూట్లలో 42,090 కిలో మీటర్ల మేర బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఫలితంగా మెదక్ ఆర్టీసీ డిపో రూ. 2,69,580 ఆదాయం కోల్పోయినట్లు డీఎం సురేఖ తెలిపారు.

ఇక ఇసుక బజార్లు..



జిల్లాలో 10చోట్ల ఏర్పాటుకు చర్యలు

- అనుమతి ఇచ్చిన 'టీజీఎండీసీ'
- ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు పంపిణీ

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరగడంతో పాటు నిర్మాణ దారులకు ఇసుక ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ఇసుక బజార్లను ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో 10 ఇసుక బజార్ల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఇందులో మూడింటికి తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం జిల్లాలో ఆందోల్, నారాయణఖేడ్ మండలంలోని జకల్ శివారులో ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. మరో వారం పది రోజుల్లో కోహీర్ మండలంలోని కవేలి వద్ద మరొకటి ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో జహీరాబాద్ నియోకవర్గంలోని సింగీతం, జహీరాబాద్, ఝరాసంఘం మండలంలోని మాచ్నూర్, సంగారెడ్డి, సదాశివపేట్ మండలంలోని సిద్దాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గంలోని చిట్కుల్, జిన్నారం, ఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మండలంలోని మునిగేపల్లి గ్రామాల్లో ఇసుక బజార్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. వీటి ద్వారా లబ్ధిదారులకు వారి వారి ఇళ్ల నిర్మాణాల స్టేజీలను బట్టి ఇసుకను అందించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించి ఇసుకను పొందవచ్చు. ప్రస్తుతం ఈ ఇసుక బజార్లకు నల్గొండ, సిద్దిపేట జిల్లాలోని కొండపాక ప్రాంతాల నుంచి ఇసుక సరఫరా జరిగింది. ప్రస్తుతం టన్నుకు రూ. 1,200 చొప్పున అందజేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు కామారెడ్డి జిల్లాలోని రీచ్‌లను ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడి నుంచి ఇసుక సరఫరా జరిగితే ధర మరింత తగ్గే అవకాశం ఉంది.

జోరుగా నిర్మాణాలు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం 4 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. జిల్లాలో 14,538 ఇళ్లు మంజూరు కాగా, 4,291 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. 655 ఇళ్లు రూఫ్‌లెవల్, 183 ఆర్సీసీ స్టేజీలో ఉన్నాయి. వివిధ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో అధికారులు డబ్బులు జమ చేశారు.

బిర్కూర్ రీచ్ ప్రారంభానికి చర్యలు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఇసుక బజార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. కామారెడ్డి జిల్లా బిర్కూర్ రీచ్‌ను ప్రారంభించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. ఇది ప్రారంభమైతే లబ్ధిదారులకు మరింత చౌకగా ఇసుక లభించనుంది.

– సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్


మూడు మంజూరు



జిల్లాలో పది ఇసుక బజార్ల ఏర్పాటుకు టీజీఎండీసీకి ప్రతిపాదనలు పంపించగా, మూడు మంజూరు చేసింది. ఖేడ్, అందోల్‌లో ఇసుక బజార్లు ప్రారంభించాం. అనుమతులు రాగానే మిగితావి ఏర్పాటు చేస్తాం.

– చలపతిరావు, గృహ నిర్మాణశాఖ, ప్రాజెక్టు డైరెక్టర్

అదే వరుస.. తప్పని గోస



యూరియా కోసం రైతు వేదిక వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతుల ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంతో పాటు మక్కరాజీపేటలో శనివారం రెండు వేల బస్తాల యూరియా రాగా, రైతులు శుక్రవారం రాత్రే చేగుంట రైతువేదిక వద్దకు చేరుకున్నారు. భారీగా రైతులు తరలిరావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. యూరియా పంపిణీని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ పరిశీలించారు.

చేగుంట(తూప్రాన్)

క్లుప్తంగా

డబ్బుల విషయంలో వివాదం

● పన్నెండేళ్ల తర్వాత అన్నాచెల్లెలు రాజీ
● లోక్అదాలత్‌లో కేసు పరిష్కారం


కోర్టు ఆవరణలో రాజీపడిన అన్నాచెల్లెలు

గజ్వేల్‌రూరల్: డబ్బుల విషయంలో చోటు చేసుకున్న ఘర్షణలో కేసులు నమోదు చేసుకున్న అన్నాచెల్లెలు పన్నెండేళ్ల తరువాత లోక్ అదాలత్‌లో రాజీ పడ్డారు. గజ్వేల్ సీఐ రవికుమార్ వివరాల ప్రకారం... 2012 జూలై 29న నాసిరుద్దీన్‌తో పాటు అతని కుటుంబ సభ్యులకు తండ్రి అబ్దుల్ నబీ దుబాయ్ నుంచి పంపించిన డబ్బుల విషయంలో వివాదం తలెత్తింది. దీంతో ఒకరిపై ఒకరు ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. 12ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. శనివారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జడ్జి స్వాతిగౌడ్ ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిర్చారు. ఈ కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ రవికుమార్, పీపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొలానికి వెళ్లొస్తుండగా..

ఆటో ఢీకొట్టడంతో రైతు మృతి


చింతల భూమయ్య

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. మండలంలోని కృష్ణాపూర్ వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మార్డి గ్రామానికి చెందిన చింతల భూమయ్య(35) టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై పొలం వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకొని కృష్ణాపూర్‌కు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో అతడిని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భూమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య బాలమణి, కూతురు అంజలి, కొడుకులు ప్రసాద్, గణేశ్ ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం


అర్బాస్

జహీరాబాద్ టౌన్: విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టౌన్ ఎస్ఐ.వినయ్‌కుమార్ కథనం ప్రకారం... పట్టణంలోని మోమిన్ మొహల్లాకు చెందిన ఇస్మాయిల్ కుమారుడు ఎండీ అర్బాస్(17) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ నెల 12న మార్కెట్‌కు వెళతానని చెప్పి తిరిగి ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అన్న ముబీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట వివాహిత..

పటాన్‌చెరు టౌన్: భార్యాభర్తల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంజీ రోడ్డుకు చెందిన శ్రీనివాస్ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న భార్య స్వరూప శ్రీనివాస్ గొడవ పడ్డారు. అదేరోజు సాయంత్రం శ్రీనివాస్ వాష్ రూమ్‌కి వెళ్లి వచ్చేసరికి భార్య ఇంటి నుండి వెళ్లిపోయింది. వెంటనే భార్య కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు.

ఆవే.. ఐశ్వర్యం!

గో పోషణే జీవనాధారం

- అటవీ ప్రాంతాల్లోనే ఆవాసం ● సేంద్రియ ఎరువులతో వ్యవసాయం
- మద్యం, మాంసానికి దూరం ● గిరిజనులైనా భిన్నమైన జీవన శైలి
- వంశ మూలం మథురగా ప్రఖ్యాతి ● లంబాడీలే కానీ ఎస్టీలు కారు

ఆవుల పెంపకమే వృత్తిగా.. వాటి పేడతో పండించిన పంటలే సంపదగా.. అటవీ ప్రాంతాల్లో జీవిస్తున్నారు ఉత్తరప్రదేశ్ మథుర లభాణీలు. వీరు కంగ్టి మండలంలోని సర్దార్‌తండా, ఎర్లరేగడితండా, ముకుందతండా, రాజారాం తండాల్లో స్థిరపడినప్పటికీ.. మథుర లభాణీల (కాయితీ, లంబాడ, బాపన్ లభానీ) జీవనానికి ఇక్కడి గోర్మాటీ లంబాడాల జీవనశైలికి భిన్నంగా ఉంది. అంతేకాదు వారి వేష, భాష శైలియే వేరు. పశుపోషణే వృత్తిగా కొనసాగుతున్న వీరిపై ఈ వారం సాక్షి కథనం. – కంగ్టి(నారాయణఖేడ్):

● శ్రీ కృష్ణుని వంశస్థులుగా చెప్పుకొనే మథుర లభాణీలు నేటికి ఆవుల పెంపకమే వృత్తిగా జీవిస్తున్నారు. వారి ఆటలు, పాటలు, పండుగలు, స్త్రీ, పురుషుల సంప్రదాయ వేషాల్లోనూ భిన్నత్వం ప్రస్ఫుటమవుతుంది. తలపై కోలలు ధరించడం సైతం వారి వేషధారణలో ప్రత్యేకం. ఆకర్షణీయమైన వీరి వేషధారణ అందరిని ఆకట్టుకుంటుంది.


మేత మేస్తున్న గోవులు


తాగునీటి కుంట వద్ద తెల్ల ఆవులు


సంప్రదాయ వేషధారణలో కాయితీ లభాణీ పురుషులు

పశుపోషణ, వ్యవసాయమే జీవనాధారం

మథుర లభాణీ గిరిజన తెగకు చెందిన వీరు పశుపోషణతోపాటు ఆవుల పేడను సేంద్రియ ఎరువుగా ఉపయోగిస్తూ పంటలు పండిస్తున్నారు. వీరు రుతుపవనాలపై ఆధారపడి వర్షాకాలంలోనే మొక్కజొన్న, పత్తి పంటలు పండిస్తారు. మండలంలోని పలు తండాల్లో 258 కుటుంబాలు ఉన్నాయి. కాగా 1200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు వీరి ఆధీనంలో ఉన్నట్లు తెలిపారు. పదేళ్ల క్రితం వరకు 9 వేలకు పైగా ఉండే పశుసంపద ప్రస్తుతం పిల్లలు చదువుల బాట పట్టడంతో 4వేలకు తగ్గినట్లు గిరిజనులు పేర్కొన్నారు. వీరు ఇప్పటికీ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల జాబితాలో కొనసాగుతున్నారు. కాగా పదేళ్ల నుంచి తమను ఎస్టీలుగా మార్చాలని ఉద్యమాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2015లో వెంకట చెల్లప్ప కమిటీ ద్వారా వీరి ఆర్థిక పరిస్థితులు, వీరి జీవన ప్రమాణస్థాయి, అవసరాలపై వివరాలు స్వీకరించి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం. సర్దార్ తండాలో యువకులు ఆర్మీ, నేవీ ఉద్యోగాల వైపు ఆకర్షితులవుతున్నారు. తండాకు చెందిన బంతిలాల్, బి.రవీందర్ 8 ఏళ్లుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తుండగా, పి. రవీందర్ నేవీలో ఉద్యోగం సాధించి ఈ నెల 17న జాయిన్ అవుతున్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణాష్టమి వేడుక ప్రధానం

వీరి ప్రధాన పండుగలో శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహిస్తారు. విజయదశమి వేడుక సైతం అందరితో పాటు జరుపుకోకుండా దసరా ముందు వచ్చే మంగళవారం నిర్వహించడం ఆనవాయితీ. వర్షాకాలం ఆరంభంలో యువతులు తీజ్ ఉత్సవం జరుపుకుంటారు. సంప్రదాయ వేషధారణలో మహిళలు, పురుషులు బృందాలుగా నృత్యాలు చేస్తారు. శ్రీకృష్ణుని వంశస్థులుగా చెప్పుకొనే కాయితీ లభాణీలు మద్యం తాగరు. మాంసాహారం భుజించరు. నియమ, నిష్టలకు పెట్టింది పేరుగా ఉంటుంది వీరి జీవన విధానం.

వంశ వృత్తిని కొనసాగిస్తున్నాం



ఒక్కో కుటుంబంలో వందల పశువులను పోషిస్తూ వంశవృత్తిని కొనసాగిస్తున్నాం. పశుగ్రాసం, తాగునీటి కోసం చాలా ఇబ్బందులు ఎదురవుతున్నా మొక్కవోని దీక్షతో పశుపోషణ చేస్తున్నాం.

– మంగళ్‌చంద్ మహారాజ్, ఎర్లరేగడితండా, కంగ్టి మండలం

కష్టంగా పశుపోషణ ...



వందల, ఏళ్ల నుండి నిర్వహిస్తున్న వృత్తి నెమ్మదిగా మందగిస్తోంది. పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం పట్టణాల బాట పడుతున్నారు. ఇంకా కొన్నేళ్ల తర్వాత పశుపోషణ కష్టంగా మారనుంది. – శివలాల్ నాయక్, సర్దార్‌తండా, కంగ్టి మండలం


సంప్రదాయ వేషధారణలో మథుర లంబాడ మహిళలు

కొండలు, గుట్టల్లోనే జీవనం

పశువుల మేత కోసం కొండలు, గుట్టల ప్రాంతాల్లో అటవీ విస్తీర్ణం ఉన్న ప్రదేశాలే వీరి ఆవాసాలుగా మారాయి. ఇటీవలి కాలంలో వ్యవసాయ భూముల్లో పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో క్రమంగా అటవీ ప్రాంతాలు ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. పశువుల గ్రాసం కోసం వేల సంఖ్యలో ఉన్న గోవులతో పొరుగున ఉన్న కామారెడ్డి జిల్లా వర్ని, నసుర్లాబాద్, కొలాస్, పెద్దగుట్ట, కాటేపల్లి అడవుల్లో మేపుతూ జీవనం సాగిస్తున్నారు.


పండుగలో ప్రత్యేక వేషధారణలో లభాణీ మహిళ

బోల్తా పడిన కోడిగుడ్ల వాహనం

డ్రైవర్, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు


రాజీవ్ రహదారిపై బోల్తా పడిన కోడిగుడ్ల వాహనం

కొండపాక(గజ్వేల్): కోడిగుడ్ల వాహనం రాజీవ్ రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటన కుకునూరుపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా గొల్లపల్లిలోని పౌల్ట్రీఫాం నుంచి టాటా ఏసీ వాహనంలో కోడిగుడ్లను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో కుకునూరుపల్లి శివారులో అదుపు తప్పి వాహనం సుమారు 20 గజాల దూరం వరకు డివైడర్‌ను ఢీకొట్టుకుంటూ వెళ్లి రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. దీంతో వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కోడిగుడ్లు పగిలి రోడ్డుపై పడటంతో ద్విచక్ర వాహనదారుడు అందులోంచి వెళ్తూ స్కిడ్ అయి పడగా గాయాలు సైతం అయ్యాయి. సుమారు 15 నిమిషాల పాటు వాహనాలు నిలిపోయాయి. పోలీసులు కోడిగుడ్ల వాహనాన్ని రోడ్డు పైనుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా ఇదే ప్రదేశంలో ఇటీవల ద్విచక్ర వాహనదారుడు డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. ఈ ప్రదేశాన్ని డేంజర్ జోన్‌గా గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


నారాయణఖేడ్: ప్రమాదానికి గురైన ఆటో, కారు

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ధర్మారం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... దుబ్బాక గ్రామానికి చెందిన నూనె అశోక్, సుశాంత్ బైక్‌పై సిద్దిపేట నుండి దుబ్బాకకు వెళుతున్న క్రమంలో ధర్మారం శివారులో అదుపు తప్పి ప్రమాద సూచిక బోర్డును బలంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని..

నారాయణఖేడ్: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నాందేడ్-అకోలా 161 జాతీయ రహదారిపై నిజాంపేట్ మండలం బాచేపల్లి సమీపంలో చోటు చేసుకుంది. మెదక్ జిల్లా రేగోడ్ మండలం నుంచి ఆటోలో యూరియా బస్తాలను కంబాపురం తరలిస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మందాల వీరప్ప, అమృత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి ఖేడ్ ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

చిన్నారి హత్య కేసులో..

● నిందితుల అరెస్టు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: చిన్నారి హత్య కేసులో తల్లి, ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం తూప్రాన్‌లో డీఎస్పీ నరేందర్‌గౌడ్ కేసు వివరాలు వెల్లడించారు. శివ్వంపేట మండలం శభాష్‌పల్లికి చెందిన మమత వివాహేతర సంబంధానికి అడ్డువస్తుందని కన్న కూతురిని ప్రియుడు ఫయాజ్‌తో కలిసి గొంతునులిపి హత్య చేసిన విషయం తెలిసిందే. కాగా ఆ తర్వాత నిందితులిద్దరిని గుంటూరు జిల్లా నరసారావుపేటలో పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కాగా చిన్నారిని హత్య చేసి పాతిపెట్టిన అనంతరం వరుస బైక్ దొంగతనాలకు పాల్పడ్డారు. బైక్‌పై చేగుంట మీదుగా తిరిగి నరసారావుపేటకు బయలు దేరారు. చేగుంటకు వెళ్లగానే పెట్రోల్ అయిపోవడంతో మరో బైక్‌ను అపహరించి గజ్వేల్ వరకు, అక్కడ పెట్రోల్ అయిపోవడంతో బైక్‌ను చోరీ చేసి భువనగిరి వరకు వెళ్లారు. నిందితుడు షేక్ ఫయాజ్‌పై ఇప్పటికే 19 కేసులు ఉన్నాయి. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రంగాకృష్ణ,ఎస్ఐ మధుకర్ రెడ్డిలను డీఎస్పీ అభినందించారు.

యూరియా 'బ్లాక్'!


పరిగిలో ఆటోలో తరలిస్తున్న యూరియా బస్తాలు

పరిగి: యూరియా కోసం ఓ వైపు రైతులు పడరాని పాట్లు పడుతుంటే ఫర్టిలైజర్ దుకాణదారులు మాత్రం బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిపూట అధిక ధరలకు అమ్ముతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణ కేంద్రంలోని చిన్నారి ఆస్పత్రి పక్కన ఉన్న గోదాం నుంచి శనివారం రాత్రి దుకాణదారుడు యూరియాను ఆటోలో తరలిస్తుండగా ఓ రైతు వీడియో తీసి వాట్సప్‌లో వైరల్ చేశాడు. ఒక్క బస్తా కోసం పగలురాత్రి తేడాలేకుండా తాము లైన్‌లో నిలబడినా, స్టాక్ అయిపోందని వెనక్కి పంపిస్తూ.. ఇలా రాత్రి వేళ బ్లాక్ మార్కెట్‌కు తరలించడం ఏమిటని రైతులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బైక్ చోరీ



బైక్‌ను ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తి

నిజాంపేట(మెదక్): పొలం వద్ద ఉంచిన బైక్ చోరీకి గురైంది. ఈ ఘటన మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కంపె నాగరాజు తన వ్యవసాయ పొలంలోని గుడిసె వద్ద బైక్‌ను ఉంచి పని చేసుకుంటున్నాడు. పనులు ముగించుకుని వచ్చే సరికి అక్కడ బైక్ కనిపించలేదు. దీంతో చుట్టు ప్రక్కల వెతికినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో సీసీ కెమెరాల ఆధారంగా వ్యక్తిని గుర్తు పడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మాసాయిపేటలో...

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన మాసాయిపేటలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగుడు కిరాణం షాపు, లాండ్రీ షాపు తాళాలు పగులగొట్టి చోరీ చేశాడు. నగదుతోపాటు వస్తువులు చోరీకి గురైనట్లు షాపు యజమానులు తెలిపారు. ఇదిలా ఉండగా దగ్గరలోనే ఉన్న సాయిబాబ దేవాలయం వద్ద గల తాళాలు సైతం ధ్వంసమయ్యాయని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి..


బదనకంటి మహేశ్

నిజాంపేట(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నార్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బదనకంటి (గొల్ల) లక్ష్మి, పర్శరాములు దంపతుల కుమారుడు మహేశ్(24) శుక్రవారం ఉదయం గేదెలను మేపడానికి వెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో చుట్టు ప్రక్కల వెతుకుతుండగా గ్రామంలో ఉన్న హైదర్ చెరువు వద్ద మృతుని చెప్పులు కనబడటంతో పోలీసులకు సమాచారం అందించారు. రెస్క్యూ టీమ్ సహాయంతో వెతకగా శనివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. చెరువులోకి దిగిన గేదెలను బయటకు తోలుకురావడానికి మహేశ్ నీటిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జీఎస్టీ తెచ్చిన గొప్ప నాయకుడు మోదీ

● అవగాహన సదస్సులో ఎంపీ రఘునందన్‌రావు
● కాంగ్రెస్ పాలనలో బిల్లు ఎందుకు పాస్ కాలేదు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు


హాజరైన వ్యాపారస్తులు

సిద్దిపేటకమాన్: భారతదేశంలో ఒకటే పన్ను విధానం ఉండాలని జీఎస్టీ తెచ్చిన గొప్ప నాయకుడు మోదీ అని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సిద్దిపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో వర్తక, వాణిజ్య వ్యాపారస్తులతో జీఎస్టీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. అప్పట్లో పదేండ్లు పాలించిన కాంగ్రెస్ జీఎస్టీ బిల్లును ఎందుకు పాస్ చేయలేకపోయిందని ప్రశ్నించారు. జీఎస్టీ తగ్గించడం వల్ల మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీవీ, ఫ్రిడ్జ్, కార్లు, పన్నీరు, పిండిపదార్థాలు, డైరీ ఉత్పత్తులు వంటి 85వస్తువులపై ధరలు తగ్గనున్నట్లు తెలిపారు. ఓటు, నోటు చోరీ చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులేనని చెప్పుకొచ్చారు. దేశంలో ఒక కోటి 51 లక్షల మంది జీఎస్టీ చెల్లిస్తున్నారన్నారు. 173దేశాల్లో ఏ ప్రధాని కూడా చేయని విధంగా 11ఏళ్ల నుంచి మన దేశానికి మోదీ ప్రధానిగా చేస్తున్నారన్నారు. దేశంలో 11 ఏళ్లలో 25కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు, వ్యాపారస్తులు గంప కృష్ణ, భూపతి, వీరేశం , సత్యనారాయణ, సుతారి కార్తీక్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 3787 కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి


కేసును పరిష్కరించి పత్రాలను అందిస్తున్న న్యాయమూర్తులు

సిద్దిపేటకమాన్: లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. సిద్దిపేట జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల విలువైన సమయం, డబ్బులు ఆదా అవుతుందన్నారు. రాజీ చేసుకోదలచిన క్రిమినల్, గృహహింస, చెక్ బౌన్స్, మోటారు ప్రమాద కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో 3,733 క్రిమినల్, 39 సివిల్, 15మోటారు ప్రమాద కేసులతో పాటు మొత్తం 3,787 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. మోటారు ప్రమాద కేసుల్లో బాధితులకు రూ.1కోటి75వేలు బాధితులకు ఇప్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జయప్రసాద్, మిలింద్‌కాంబ్లి, సంతోష్‌కుమార్, సాధన, తరణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు సత్యనారాయణ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు..

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి హేమభార్గవి



మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పోష్ చట్టంతో పాటు షీ-బాక్సు పోర్టల్‌ను తప్పకుండా అమలు చేయాలని డీడబ్ల్యూఓ హేమభార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో సురక్షితమైనవిగా ఉండేలా 2013లో భారత ప్రభుత్వం వీటిని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు లేకుండా ఉండేందుకు అంతర్గత ఫిర్యాదుల పరిష్కారానికి షీ-బాక్స్ పెట్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని వివరించారు. దీనికి సంబంధించి కమిటీ సభ్యుల వివరాలను సమర్పించడానికి 10 మంది అంతకన్నా ఎక్కువ మంది ఉద్యోగులు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ ఫిర్యాదుల పరిష్కారం కోసం మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ షీ-బాక్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాన్ని ప్రారంభించిందని తెలిపారు. దీని ద్వారా లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళా ఉద్యోగులు, సిబ్బంది నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 181 ఫిర్యాదు, సహాయానికి సంప్రదించాలని కోరారు.